క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్, వినాయకనగర్ సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవీ చంద్రగిరికాలనీ, శారదానగర్, ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ల మరమ్మతులు బుధవారం 9 నుంచి 11 గంటల వరకు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. దీన్‌దయాళ్‌నగర్, సుధానగర్, ఓల్డ్ సఫిల్‌గూడ, వీవీ గార్డెన్స్, సుధానగర్, జైన్‌మందిర్, శివగౌరి ఎన్‌క్లేవ్, చంద్రగిరికాలనీ, సూర్యనగర్‌కాలనీ, గంగపుత్ర సంఘం, వినాయకనగర్ బ్లాక్ 3 నుంచి 6 వరకు, డీమార్ట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మరమ్మతుల కారణంగా..

మౌలాలి: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా 11కేవీ చంద్రగిరి కాలనీ, 11కేవీ శారదానగర్, 11కేవీ ఓల్డ్ సఫిల్‌గూడ ఫీడర్ల పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దీనదయాళ్‌నగర్, దినకర్‌నగర్, ఓల్డ్ సఫిల్‌గూడ, వీవీగార్డెన్స్, సుధానగర్, జైన్ మందిర్, శివగౌరీ ఎన్‌క్లేవ్, చంద్రగిరి కాలనీ, సూర్యనగర్, గంగపుత్ర సంఘం, వినాయక్ నగర్ బ్లాక్–3 నుంచి 6, నవభారత్ స్కూల్, నలంద స్కూల్, డీఏవీ స్కూల్, డీమార్ట్ వెనుక ప్రాంతాల్లో కరెంటు ఉండదని అధికారులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని అన్నికాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌నగర్ కాలనీలో వార్డు కార్యాలయం నిర్మించాలని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఈ కార్తీక్, ఏఈ అరుణ్, మండల రెవెన్యూ సర్వేయర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ సఫిల్‌గూడ చౌరస్తాలో రూ.28 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాన రహదారి దెబ్బతిన్నదని, సీసీ రోడ్డు నిర్మాణంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో గీతామూర్తి, సూరజ్‌సింగ్, మురళీగౌడ్, నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో రామకృష్ణాపురం గెలుపు



ఫుట్‌బాల్ జట్టును అభినందిస్తూ..

అల్వాల్: అంబర్‌పేట్ ప్లే గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఇంటర్ జోనల్ సమ్మర్ కోచింగ్ క్యాంపు ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీల్లో నేరేడ్‌మెట్ రామకృష్ణాపురం ప్రాంతానికి చెందిన ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలిచిందని జోనల్ ఇన్‌చార్జి వై.రాజు తెలిపారు. విజేతగా నిలిచిన జట్టును చైర్మన్ చంద్రశేఖర్, కోచ్‌లు శైలేష్ కుమార్, నిరంజన్, సురేష్ అభినందించారు.

ఓపెన్ జిమ్ పనులను త్వరగా పూర్తిచేయండి



కుషాయిగూడ: మీర్‌పేట–హెచ్‌బీకాలనీ, హెచ్‌బీకాలనీ ఫేస్–2లో జరుగుతున్న ఓపెన్ జిమ్ పనులను మంగళవారం కార్పొరేటర్ ప్రభుదాస్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. స్థానికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి ఉల్లెం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంపై ఫైర్..

- ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో.. రెండేళ్ల క్రితం ఫైర్ స్టేషన్ నిర్మాణం
- అయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- ఎండలు మండుతున్నా పట్టాదా..?
- ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా..?
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఉప్పల్ భగాయత్‌లో ఫైర్ స్టేషన్

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో రెండేళ్ల క్రితం నిర్మించిన ఫైర్ స్టేషన్ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రారంభించేందుకు అగ్నిమాపక ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో ఇప్పటికీ అలంకార ప్రాయంగానే మారింది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని 50 శాతం వరకు పారిశ్రామికవాడలతోనే ఉంది. సగటున ప్రతి వేసవిలో 5 నుంచి 10 వరకు అగ్ని ప్రమాదాలు రికార్డవుతున్నాయి. ఇవి దాదాపుగా నివాస ప్రాంతాలకు అతి సమీపంలో ఉండటంతో ఉప్పల్, నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ ప్రాంతాలు పూర్తిగా పారిశ్రామికవాడలే.. వీటితో పాటు ఐటీ కంపెనీలు, అపార్టుమెంట్లు, ఐఐసీటీ, ఎన్ఎండీసీ, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీసీఎంబీ వంటి జాతీయ పరిశోధన సంస్థలు, ఉస్మానియా యూనివర్సిటీ, మెట్రో స్టేషన్ కార్యాలయాలు, సీడీఎఫ్‌డీ వంటి అనేక సంస్థలు ఉండటంతో ఉప్పల్ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రాల ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం ఉప్పల్‌లో అదనంగా మరో ఫైర్ స్టేషన్‌ను ఉప్పల్ భగాయత్‌లో రెండు ఫైర్ ఇంజిన్లు ఉండే విధంగా స్టేషన్‌ను నిర్మించారు.

ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టదా..?

ఇప్పటికే తార్నాక, మల్లాపూర్ ప్రాంతాల్లో ఫైర్ స్టేషన్లు ఉన్నా డిమాండ్ దృష్ట్యా మరొకటి కావాలనే ఉద్దేశ్యంతో ఉప్పల్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అసలే ఎండా కాలం.. మండే కాలం ప్రమాదాలు పొంచి ఉన్నా కేంద్రాన్ని నిర్మించి రెండేళ్లు గడుస్తున్నా అధికారులు ప్రజాప్రతినిధుల అలసత్వంతో ప్రారంభానికి నోచకోకపోవడంపై పలువురు పారిశ్రామిక వేత్తలు, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఉప్పల్ అగ్నిమాపక కేంద్రం ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కంటి వెలుగు ప్రారంభోత్సవంలో మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 13వ డివిజన్ దేవేందర్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం కంటి వెలుగు రెండో విడత శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణకు కంటి వెలుగు పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. బుధవారం నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ క్యాంపు అందుబాటులో ఉంటుందన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, 13వ డివిజన్ కార్పొరేటర్ దానగళ్ల అనిత యాదగిరి, కాలనీ ప్రతినిధులు బోడగల్ల సదానంద్, భగవంతులు, జెన్న ధర్మయ్య, మల్లేష్‌యాదవ్, జోగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం పీవీఎన్ కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేయాలని సూచించామన్నారు. బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు పూర్తయితే ముంపు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, నాయకులు సత్యనారాయణ, సంపత్, కిషోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్ కోసం భూములు ఇస్తున్నాం



సమావేశంలో దళిత నేతలు

బోడుప్పల్: రేపటితరం పిల్లల భవిష్యత్ కోసం తమ భూములను ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు బోడుప్పల్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిన్నింగల్ల కుమార్, కార్పొరేటర్ చీరాల నర్సింహ, సలహాదారులు మీసాల కృష్ణ వెల్లడించారు. బోడుప్పల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బోడుప్పల్ పెద్ద కంచెలో 61 మంది దళిత కుటుంబాలకు 336 ఎకరాల భూమి ఉందని, అందులో 43 మంది దళిత రైతులు తమ 234 ఎకరాలను భూమిని ల్యాండ్ పూలింగ్ కింద హెచ్ఎండీఏకి ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఎకరానికి 600 గజాల చొప్పున తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి మల్లారెడ్డిగానీ బలవంతంగా, భయపెట్టి తీసుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మా ఇష్ట పూర్వకంగా ప్రభుత్వానికి ఇచ్చేందుకు లిఖిత పూర్వకంగా ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. కొంతమంది మధ్యవర్తులకు లాభం లేకపోవడంతో అడ్డుపడుతున్నారన్నారు. 43 మంది కుటుంబాల జీవితాలు బాగుపడాలనే ఉద్దేశ్యంతో భూములు ఇస్తున్నామని, మా పిల్లలు ఇప్పటికీ నగర పాలక సంస్థలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. 43 కుటుంబాలకు చెందిన వారు ల్యాండ్ పూలింగ్ కింద తమ భూములు ఇచ్చేందుకు సిద్ధమని వారు వెల్లడించారు. కార్యక్రమంలో బోడుప్పల్ అంబేడ్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు దానగల్ల యాదగిరి, పంటి కిషన్, రాపోలు రామస్వామి, రాపోలు శంకరయ్య, రాపోలు నారాయణ, ఉపాధ్యక్షుడు చంటి శ్రీనివాస్, ప్రతినిధులు మీసాల యాదగిరి, మైసగల్ల మల్లేష్, ఉప్పరి విజయ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో సీడీఈడబ్ల్యూ కేంద్రం ప్రారంభం

ఉప్పల్: సేఫ్ సిటీ ప్రాజెక్ట్ కింద మహిళల సౌకర్యార్థం మూడు కమిషనరేట్ల పరిధిలో 26 సీడీఈడబ్ల్యూ కేంద్రాలను ప్రారంభించనున్నామని అదనపు డీజీపీ శిఖా గోయెల్ అన్నారు. మంగళవారం ఉప్పల్‌లో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(సీడీఈడబ్ల్యూ) కేంద్రాన్ని అదనపు డీజీపీ శిఖా గోయెల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ రాచకొండ సత్యనారాయణ, కుషాయిగూడ డీసీపీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ పీఎస్‌లో..



కుషాయిగూడ పీఎస్‌లో ప్రారంభిస్తున్న రాచకొండ అడ్మిన్ డీసీపీ ఇందిర

కుషాయిగూడ: సమాజంలో వివిధ రకాలు వివక్షకు గురవుతున్న మహిళలకు ఈ కేంద్రం చక్కటి వేదికని రాచకొండ అడ్మిన్ డీసీపీ ఇందిర అన్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్(సిడిఈడబ్ల్యూ) కౌన్సెలింగ్ సెంటర్‌ను మంగళవారం ఆమె కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కౌన్సెలింగ్ సెంటర్ అడ్మిన్ వై.ప్రేరణ, సభ్యురాలు పూజ, ఎస్ఐలు ఉపేందర్‌యాదవ్, భద్రయ్య, సాయికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

యుగంధర్‌ను పరామర్శించిన రామచంద్రరావు



హాస్పిటల్‌లో యుగంధర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

బోడుప్పల్: బోడుప్పల్ అభయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న న్యాయవాది యుగంధర్‌ను బీజేపీ మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అవినీతి అక్రమాలపై కేసులు వేసినందుకు యుగంధర్‌పై తీవ్రంగా దాడి చేసి గాయపర్చారన్నారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన కొనసాగుతోందని, ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీజేపీ బోడుప్పల్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, నాయకులు రామరావు, పీఠం ప్రదీప్‌కుమార్, బజారు కిరణ్‌కుమార్, లక్ష్మయ్య, రాసాల నర్సింగ్‌రావు, విజయలక్ష్మి, రాజు తదితరులు ఉన్నారు.

బ్యాంక్ కాలనీలో లైన్ కనెక్షన్లు ఇవ్వాలి



కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: బ్యాంక్ కాలనీ రోడ్ నంబర్ 6, 7, 8లలో మిషన్ భగీరథ మెయిన్ నీటి పైప్‌లైన్‌కు ఇంటర్ లైన్ కనెక్షన్లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి వార్డు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడారు. జలమండలి అధికారులతో మాట్లాడి ఈషన్ భగీరథ లైన్‌కి ఇంటర్‌లైన్ అనుసంధానం చేసేలా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు వెంకటేశ్వర్‌రావు, అంజయ్య, శివశంకర్, సూర్ణం రాజేష్ రాజ్‌కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

విత్తనాల తయారీ కేంద్రంలో తనిఖీలు

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలోని ఎల్డోరడో అగ్రిటెక్ విత్తనాల తయారీ కేంద్రంలో మంగళవారం సీడ్ టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ టీమ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. బీటీ పత్తి విత్తనాల నాణ్యత, పత్తి విత్తనాలు నకిలీవా..? అని తనిఖీ చేశారు. విత్తనాలను టెస్ట్ చేయగా నాణ్యమైన విత్తనాలు తయారీ చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఏడీఏ సుధాకర్‌బాబు, ఎస్ఓటీ పోలీస్ జెమ్స్ బాబు, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ మహేష్ బాబు, జిల్లా అగ్రికల్చర్ అధికారి సుధారాణి, ఎండీ లింగ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



సీడ్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరసింహస్వామి



ఇన్‌స్పెక్టర్లు నరసిహస్వామి, నాగరాజును సన్మానిస్తున్న డిఫెన్స్ కాలనీ సొసైటీ సభ్యులు

అల్వాల్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరసింహస్వామి అన్నారు. మంగళవారం డిఫెన్స్ కాలనీ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేతిలో సెల్‌ఫోన్ ఉందికదా అని అనవసరమైన రుణ యాప్స్, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్లకు స్పందించి మోసపోవద్దని ఆయన సూచించారు. విద్యుత్ బిల్లులు బకాయి ఉన్నాయని, ఎటువంటి ఆధారం లేకుండా రుణాలు ఇస్తామని, మీకు లాటరీ తగిలిందని వచ్చే సందేశాలకు సమాధానం ఇవ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరగాళ్లు అంతర్జాతీయ వాట్సాప్ కాల్స్ చేస్తున్నారని, దానికి సమాధానం ఇవ్వొద్దని కోరారు. సైబర్ నేరగాళ్లు అనేక రకాల కుట్రపూరితమైన యాప్‌ల ద్వారా ప్రజల నుంచి డబ్బులు గుంజాలని మోసాలకు తెరలేపుతున్నారన్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే 1930లో ఫిర్యాదు చేయాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ నేరలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన సందర్భంగా ఆయనకు డిఫెన్స్ కాలనీ సొసైటీ సభ్యులు నరసింహస్వామిని ఘనంగా సత్కరించారు. కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్ నాగరాజును సైతం వారు ఘనంగా సన్మానించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ వెల్లడించారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు శ్రీమాత నిమిషాంబదేవి 17వ బ్రహ్మోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

స్వచ్ఛత అందరి బాధ్యత



మల్లికార్జునగర్‌లో అవగాహన కల్పిస్తున్న మనోహర్‌రెడ్డి

అల్వాల్/గౌతంనగర్: మేరీ లైఫ్ మేరీ స్వచ్ఛ షెహర్‌లో భాగంగా జీహెచ్ఎంసీలో ఆర్ఆర్ఆర్ రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ విధానాన్ని వచ్చేనెల 5వ తేదీ వరకు నిర్వహించడానికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్ఓ మంజుల తెలిపారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద వస్తువులు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య సంస్థలు తమ వద్ద ఉన్న నిరుపయోగంగా ఉన్న దుస్తులు, పాదరక్షలు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, కార్డుబోర్డు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వ్యర్థాలను నగర పాలక సంస్థకు అందించాలన్నారు.

గౌతంనగర్‌లో..

డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్ ఫ్రెండ్స్ అసోషియేషన్ గ్రౌండ్స్‌లో మంగళవారం మల్కాజిగిరి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పాత వస్తువులు సేకరణ రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి పారిశుద్ధ్య అధికారి మనోహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరికీ అసౌకర్యం కలగకుండా పనులు చేయండి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: నాలా పూడికతీత పనులను మంగళవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డినగర్ నుంచి నాగారం, చర్లపల్లి నుంచి నాగారం వరకు చేపట్టిన నాలా పూడికతీత పనులను నిర్వహణపై ఆరా తీశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు పూడికతీత పనుల్లో నాణ్యతను పాటించి రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు ఉన్నారు.

జగతి ఆస్పత్రి సీజ్



రాంపల్లి చౌరస్తాలో ఆసుపత్రిని సీజ్ చేస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జగతి ఆస్పత్రిని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సీజ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తమ అధికారుల బృందంతో రాంపల్లి చౌరస్తాలో ఉన్న జగతి ఆస్పత్రికి చేరుకున్న ఆయన ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదు అందినట్లు తెలియజేశారు. ఆస్పత్రిలో అర్హత కలిగిన వైద్యులు లేకుండానే కొనసాగుతోందని, కొందరు ఫిర్యాదు చేశారని ఈమేరకు విచారణ చేపట్టి ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రిని సీజ్ చేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులను నిర్వహిస్తే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. మంగవారం వీబీపీ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్, మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో చిలుకానగర్ డివిజన్‌పరిధిలోని కళ్యాణపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడారు. వీబీపీ హ్యూమన్ రైట్స్ వారు పేద ప్రజల కోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఒబైద్, స్థానికులు బజార్ జగన్, ఎద్దుల కొండల్ రెడ్డి, జావీద్, ఖాజా, మొహీనుద్దీన్, బింగి శ్రీనివాస్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ వీరుడికి సన్మానం



విజ్ఞానంద్‌ను సన్మానిస్తున్న కోచ్ భాను, పల్లె ప్యారడైజ్ అసోసియేషన్ ప్రతినిధి

కాప్రా: కొరియాలో ఇటీవల జరిగిన ఆర్చరీ క్రీడల్లో పాల్గొని విజయం సాధించిన విజ్ఞానంద్‌ను ఘనంగా సన్మానించారు కాలనీవాసులు. ఏషియన్ పెసిఫిక్ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 19 వరకు కొరియాలో ఆర్చరీ(విలు విద్య) క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లోని అండర్ 40 రికర్వ్ విభాగంలో కాప్రాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు విజ్ఞానంద్, డాక్టర్ జాన్‌వాట్స్ పాల్గొన్నారు. తెలంగాణ నుంచి మొత్తం ఐదురుగు క్రీడాకారులు ఇందులో పాల్గొనగా అందులో కాప్రా సర్కిల్ నుంచి ఇద్దరు ఉండటం విశేషం. ఇండియన్ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొరియా వెళ్లి అండర్ 40 రికర్వ్ విభాగంలో పాల్గొన్న విజ్ఞానంద్.. కొరియన్ క్రీడాకారుడిపై విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించారు. గోల్డ్ మెడల్‌తో తిరిగి వచ్చిన విజ్ఞాన్‌ను ధనుర్విద్య అకాడమీ, పల్లె ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్చరీ కోచ్ భాను మాట్లాడుతూ.. విలువిద్యలో చిన్నారులతో పాటు ఆసక్తి ఉన్న వారందరికీ శిక్షణ ఇస్తున్నానన్నారు. క్రీడలకు వయస్సుతో సంబంధం లేదని, ఆసక్తి ఉంటే ఏ వయస్సులోనైనా విజయం సాధించవచ్చన్నారు.

వీబీపవీలో ప్రవేశాలకు ఆహ్వానం

మేడిపల్లి: మేడిపల్లిలోని వివేకానంద భారతి ఆశ్రమ విద్యాలయం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నాలుగో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తోందని వీబీఏవీ వ్యవస్థాపకుడు సుబ్రతో చైతన్య స్వామిజీ తెలిపారు. పది సంవత్సరాలు దాటిన విద్యార్థులు తమ పాఠశాలలో చేరవచ్చని ఆయన తెలిపారు. తమ పాఠశాలలో చేరే విద్యార్థులకు బుక్స్, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడల్లో తర్ఫీదు ఇస్తామని తెలిపారు. తమ విద్యాలయంలో పిల్లలను చేర్పించాలనుకునే తల్లిదండ్రులు ఫోన్: 96426 94696, 77805 08788, 63041 36412లలో సంప్రదించాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912225470 9912220571 9505507657